సాక్షి
శ్రీకాకుళం

ఆదివారం । 10 । మార్చి । 2024

I



మేకిన్ పాలిటెక్నిక్

శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మెకానికల్ విద్యార్థులు చదువుతో పాటు నైపుణ్యాలు పెంపొందించుకుంటున్నారు.

-IIలో



రెండు వాహనాలు ఢీ

కొండములగాం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురు గాయపడ్డారు. క్షతగ్రాతులు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

-IIలో

మల్లన్న ఆదాయం రూ.6,68,580

టెక్కలి: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా రావివలస ఎండల మల్లికార్జునస్వామి దేవస్థానంలో శీర్షాభిషేకం, శీఘ్ర దర్శనాలు, కేశ ఖండన, హుండీ, దాతల నుంచి రూ.6,68,580 ఆదాయం వచ్చినట్లు ఈఓ వి.రాధాకృష్ణ శనివారం తెలిపారు. గత ఏడాది రూ.7,87,331 ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు. ఐదురోజుల కిందట కూడా హుండీ లెక్కించగా రూ.1,32,847 ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు.



ప్రజారోగ్యానికి దండిగా
నిధుల మందు

- ప్రభుత్వ ఆస్పత్రులకు పూర్తిస్థాయిలో మందుల సరఫరా
- ఐదేళ్ల క్రితం బడ్జెట్ రూ.4 కోట్లు.. నేడు రూ.26.18 కోట్లకు పెరిగిన వైనం
- టీడీపీ హయాంలో 60 రకాల మందులే
- ప్రస్తుతం 359 రకాల వరకు సరఫరా

ఒకప్పుడు ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్తే వైద్యం సంగతి పక్కనపెడితే మందులు పూర్తిస్థాయిలో ఉండేవి కావు. ఉన్న అరకొర మందులు కూడా నాణ్యమైనవి కాకపోవడంతో వాటిని తీసుకెళ్లేందుకు రోగులు విముఖత చూపేవారు. గత్యంతరం లేక బయటకు వెళ్లి మెడికల్ షాపుల్లో సొంత డబ్బులతో మందులు కొనుగోలు చేసేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందుల బడ్జెట్‌ను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గణనీయంగా పెంచారు. నాణ్యమైన మందులు సరఫరా చేస్తూ రోగులకు ఆసరాగా నిలుస్తున్నారు.

నరసన్నపేట:

ప్రజారోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా పేదల ఆరోగ్యానికి సంపూర్ణ భరోసా ఇస్తూనే ఫ్యామిలీ డాక్టర్ వంటి సరికొత్త పథకాన్ని తీసుకొచ్చి రోగుల ఇళ్ల వద్దకే వైద్యులు వచ్చి సేవలు అందించే ప్రక్రియను విజయవంతంగా అమలు చేస్తోంది. ప్రజారోగ్యమే పరమావధిగా భావిస్తూ నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ ఆస్పత్రుల రూపురేఖలను సమూలంగా మార్చేసింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రితో పాటు రిమ్స్‌లో కూడా అవసరమైన వైద్య నిపుణులు, సిబ్బందిని నియమించింది. కేవలం వైద్య సిబ్బంది నియామకాలకే పరిమితం కాకుండా మందులు కూడా పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచుతూ పేదలకు ఆసరాగా నిలుస్తోంది. గత ప్రభుత్వానికి దీటుగా ఖరీదైన మందులను సైతం సిద్ధంగా ఉంచుతోంది. జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రులన్నింటికీ ఆంధ్ర ప్రదేశ్ ఆరోగ్య మౌళిక సదుపాయాల సంస్థ(ఏపీఎంఎస్ఐడీసీ) సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి మందులు సరఫరా చేస్తోంది.

భారీగా పెరిగిన బడ్జెట్..

ఐదేళ్ల క్రితం (టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు) ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, జిల్లా ఆసుపత్రులకు మందుల సరఫరా అరకొరగా ఉండేది. ఏరియా ఆసుపత్రులకు క్వార్టర్లీ నాలుగు లక్షలు విలువ కలిగిన మందులు ఇచ్చే వారు. పీహెచ్‌సీలకు లక్ష రూపాయల మేరకు మందులు సరఫరా చేసేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక మందుల బడ్జెట్ భారీగా పెంచారు. నరసన్నపేట ఏరియా ఆస్పత్రికి గతంలో రూ.మూడు లక్షలు విలువ కలిగిన మందులు వచ్చేవి. ఇప్పుడు క్వార్టర్లీ రూ.13 లక్షల విలువైన మందులు పంపిణీ చేస్తున్నారు. ఈ విధంగా జిల్లా మొత్తం మీద ఐదేళ్ల క్రితం మందుల బడ్జెట్ ఏటా రూ.4 కోట్లు ఉండగా ప్రస్తుతం రూ. 26.18 కోట్లు మేరకు బడ్జెట్ పెంచారు. వీటిలో మందుల కోసం రూ. 21,52,42,641, సర్జికల్ మందుల కోసం రూ.4,65,74,363 కేటాయించారు.



నరసన్నపేట ఆసుపత్రిలో మందులు తీసుకుంటున్న రోగులు

ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రుల వివరాలు..	
ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు	83
కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు	16
ఏరియా ఆసుపత్రులు	4
జిల్లా ఆస్పత్రులు	2 (శ్రీకాకుళం, టెక్కలి)



నరసన్నపేట ఆసుపత్రిలో ఉన్న మందుల బాక్స్‌లు

పెరిగిన మందుల రకాలు..



గతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు, అర్బన్ హెల్త్ సెంటర్లకు 60 రకాల మందులు మాత్రమే పంపిణీ చేసేవారు. ఇప్పుడు 205 రకాల మందులు ఇస్తున్నారు. వీటిలో జబ్బుల నివారణకు 172 రకాలు కాగా సర్జికల్స్ మందులు 33 రకాల వరకు ఉన్నాయి. కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆసుపత్రులకు 440 రకాలు, రిమ్స్‌కు 608 రకాల మందులు ఇస్తున్నారు. రిమ్స్‌కు ఏటా రూ.3.69 కోట్లు విలువ కలిగిన మందులు సరఫరా చేస్తున్నారు.

పూర్తిస్థాయిలో మందులు..

ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని రకాలు మందులు అందుబాటులో ఉంచుతున్నాం. ఫ్యామిలీ డాక్టర్ పథకంతో పాటు వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లకు, పీహెచ్‌సీలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రి, రిమ్స్ ఇలా వేర్వేరుగా మందుల బడ్జెట్ ఆయా ఆసుపత్రుల పరిమితి బట్టి ఇస్తున్నాం. గతంతో పోల్చితే బడ్జెట్ ఎంతో పెరిగింది. సర్జికల్స్ మెటీరియల్స్, అవసరమైన మందులు కూడా పూర్తిస్థాయిలో సరఫరా చేస్తున్నాం.

– గంట సోమేశ్వరరావు, సెంట్రల్ డ్రగ్ స్టోర్ ఇన్‌చార్జి, శ్రీకాకుళం

నాణ్యమైన మందులు..



నరసన్నపేట ఆస్పత్రికి ఎప్పటికప్పుడు వచ్చి వైద్యులను సంప్రదించి మందులు వాడుతున్నాను. మందుల నాణ్యత బాగుంది. గతంలో ఇలా మందులు ఇచ్చే వారు కాదు. బయట కొనుక్కోమని చీటీ రాసేవారు. ఇప్పుడు అలా కాదు అవసరమైన మందులు ఇక్కడ ఉచితంగా ఇస్తున్నారు. – పట్ట చిన్నవాడు, చిన్న బొరిగివలస

అన్నీ ఉచితమే..



జ్వరం రావడంతో ఉర్లాం ఆరోగ్య కేంద్రానికి వారం క్రితం వెళ్లాను. రక్త పరీక్షలు నిర్వహించారు. మందులు ఉచితంగా ఇచ్చారు. మూడు రోజుల్లో జ్వరం తగ్గింది. అన్ని రకాల వ్యాధులకు నాణ్యమైన మందులే ఇస్తున్నారు.

– కొల్లి చిన్నబాబు, కోమర్తి, నరసన్నపేట మండలం

న్యూస్‌రీల్

నేడు ఎన్‌జీఓ కార్యవర్గ ప్రతినిధుల రాక

శ్రీకాకుళం అర్బన్: ఇటీవల ఏపీ ఎన్‌జీవో సంఘ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా ఎన్నికైన శివారెడ్డి, చౌదరి పురుషోత్తంనాయుడుతో పాటు కార్యవర్గ సభ్యులు పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా శ్రీకాకుళం జిల్లాకు ఆదివారం ఉదయం 9.30 గంటలకు వస్తున్నారని సంఘ ప్రతినిధులు హనుమంతు సాయిరాం, చల్లా శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు (ఉద్యోగుల సంక్షేమం) ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి కూడా జిల్లా పర్యటనకు రానున్నారని పేర్కొన్నారు. జెడ్పీ సమావేశ మందిరంలో అభినందన సభ నిర్వహిస్తున్నామని, మంత్రి ధర్మాన ప్రసాదరావు ముఖ్య అతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు. ఎన్‌జీవో సంఘ ప్రతినిధులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విశ్రాంత ఉద్యోగులు హాజరుకావాలని పిలు పునిచ్చారు.

అనాథ అంత్యక్రియల్లో అతివలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న మహిళలు

కాశీబుగ్గ: అనాథ మృతదేహానికి మహిళలే అంత్యక్రియలు పూర్తి చేసిన ఘటన పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో శనివారం చోటు చేసుకుంది. కోసంగిపురం కూడలి పక్కన లలితా అనాథ వృద్ధాశ్రమంలో అప్పడాలమ్మ(87) అనే వృద్ధురాలు అనారోగ్యంతో మరణించింది. కుటుంబ సభ్యుల వివరాలు తెలియకపోవడంతో ఆశ్రమ నిర్వాహకురాలు సువ్వారి పద్మావతి, ఆమె సోదరి లక్ష్మి, సహాయకురాలు జయతో పాటు మరో వ్యక్తి సహకారంతో దహన సంస్కారాలు చేపట్టారు.

గడ్డి కుప్పలు దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

టెక్కలి రూరల్: సంతబొమ్మాళి మండల కేంద్రంలో యామల వీధిలో శనివారం గడ్డికుప్పలు దగ్ధమయ్యాయి. పశువుల దాణా కోసం నాలుగు కుప్పలు సిద్ధం చేయగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. టెక్కలి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అప్పటికే గ్రామానికి చెందిన వై.అప్పారావు, చర్ల జగ్గయ్య, బి.పాపయ్యలకు చెందిన గడ్డికుప్పలు కాలిపోయాయి. సుమారు రూ.50వేలకు నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేశారు. ప్రమాదానికి గల కారణాలు తెలియలేదు.

ఉద్దానం గౌరవం పెంచిన అక్కాచెల్లెళ్లు



సాయి దీప్తి, సాయి నిఖితలను సన్మానిస్తున్న ఎంపీపీ దేవదాస్‌రెడ్డి

కంచిలి: మహిళా క్రికెట్‌లో చిన్నప్పటి నుంచి అద్వితీయమైన ప్రతిభను ప్రదర్శిస్తున్న అక్కాచెల్లెళ్లు గల్లీ నుంచి ఢిల్లీ స్థాయికి వెళ్లి ఉద్దానం గౌరవాన్ని పెంచారని కంచిలి ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అన్నారు. మకరాంపురం గ్రామానికి చెందిన బొగియా సాయి దీప్తి, సాయి నిఖితలు అండర్–19, అండర్–16 విభాగాల్లో మహిళా క్రికెట్‌లో రాణిస్తూ గ్రామస్థాయి నుంచి ఢిల్లీ స్థాయి వరకు ఎదిగి పేరు ప్రఖ్యాతులు సాధించిందుకుగాను గ్రామస్తులు శనివారం స్థానిక శివాలయం ఆవరణ వద్ద ఆడిటోరియంలో ఘనంగా సన్మానించారు. భవిష్యత్తులో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, షిర్డీసాయి ఆలయ ట్రస్టీ బి.రమణసాయి, టి.వి.రమణ, దుర్గాసి ధర్మారావు, జి.వెంకటరమణ, బి.రమేష్, ఎల్.శ్రీనివాసరావు, బొగియా కామరాజు–స్వరూప దంపతులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలపై డెకన్ నిఘా



డెకెన్ కమాండింగ్ కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షిస్తున్న జిల్లా స్పెషల్ ఆఫీసర్ కె.ప్రకాశరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు అత్యంత పారదర్శకంగా కొనసాగుతున్నాయి. కాపీయింగ్ ఆరోపణలున్న కొన్ని కేంద్రాలపై అధికారులు పక్కాగా నిఘాపెట్టారు. తనిఖీ బృందాలతో అప్రమత్తం చేస్తున్నారు. డెకన్ పేరిట ఏర్పాటు చేసిన కమాండింగ్ కంట్రోల్ రూమ్ ద్వారా జిల్లా స్పెషల్ ఆఫీసర్/డీవీఈవో కోట ప్రకాశరావు, ఆర్ఐఓ ప్రగడ దుర్గారావు, డీఈసీ కమిటీ సభ్యులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. అధికారులతోపాటు ఫ్లయింగ్, సిట్టింగ్ బృందాలు వేర్వేరుగా విడిపోయి ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నారు. ఏడో రోజు ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు 957 మంది గైర్హాజరయ్యారు.

గర్భిణులకు ఆసరాగా పీఎంఎంఎస్‌వై

హిరమండలం: ప్రధాన మంత్రి మాతృత్వ సురక్షిత యోజన (పీఎంఎంఎస్‌వై) గర్భిణులకు ఆసరాగా నిలుస్తోంది. ముఖ్యంగా హైరిస్క్ ఉన్న గర్భిణులను గుర్తించేందుకు ఈ పథకం దోహదపడుతోంది. దీనిలో భాగంగా శనివారం హిరమండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో 65మంది గర్భిణులకు వైద్యాధికారులు సీహెచ్.సాయిగీత, ఫారుక్ హుస్సేన్‌లు వైద్య పరీక్షలు నిర్వహించారు. 12 మంది హైరిస్క్ గర్భిణులను గుర్తించారు. జెమ్స్ ఆస్పత్రి వైద్యులు కీర్తి, ఆదిత్య, కె.గుప్తా సహకారంతో ఉచితంగా ఆల్ట్రా సౌండ్ స్కానింగ్ చేపట్టారు. ఆరోగ్య జాగ్రత్తలు, పౌష్టికాహారం ఆవశ్యకతను వివరించారు.

వైభవంగా శివ పార్వతుల కల్యాణం




ఉమా జఠలేశ్వరుని కల్యాణం

శ్రీకాకుళం కల్చరల్: మహా శివరాత్రి వేడుకల్లో భాగంగా శ్రీకాకుళం నగరంలోని పలు ఆలయాల్లో శివపార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. నక్కవీధిలోని ఉమాజఠలేశ్వరస్వామి దేవాలయంలో అర్చకులు అశ్వినీకుమార్, మహేష్‌ల ఆధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా శివపార్వతుల కల్యాణ వేడుకలు జరిపించారు. పాండ్రంగి వీధిలోని కామాక్షిదేవి పీఠంలో ఏకాంబరేశ్వర సహిత కామాక్షిలకు అర్చకులు బి.నగేష్‌రామకృష్ణ, వేదుల సూర్యనారాయణశర్మ ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తొలిరోజు నిరాశే..!

- ఆదిత్యున్ని తాకని తొలి సూర్యకిరణాలు
- నేడు ఉదయం స్పృశించే అవకాశం

అరసవల్లి: తొలి లేత బంగారు కిరణాల కాంతుల్లో సూర్యనారాయణ స్వామి వారి మూలవిరాట్టును చూసేందుకు తరలివచ్చిన వందలాది మంది భక్తుల నిరీక్షణ ఫలించలేదు. శనివారం ఉదయం సూర్యోదయ సమయాన మబ్బులు కమ్మేయడంతో కిరణాలు గర్భాలయానికి చేరుకోలేదు. దీంతో తొలి రోజు కిరణ స్పర్శ సాధ్యం కాలేదు. దీంతో ఉదయం 5 గంటల నుంచే చేరుకున్న భక్తులు నిరాశ చెందారు. ఆదివారం ఉదయం కిరణాలు పడే అవకాశముందని ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ తెలిపారు.



మబ్బుల్లో సూర్యుడు



ఆలయంలోని క్యూలో భక్తులు

• పేదల పెన్నిధి సీఎం జగన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పెన్నిధిగా నిలుస్తున్నారని, ముఖ్యంగా మహిళలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ అండగా నిలుస్తున్నారని వక్తలు పేర్కొన్నారు. జిల్లాలో శ్రీకాకుళం, నరసన్నపేట నియోజకవర్గాల పరిధిలో శనివారం వైఎస్సార్ చేయూత సంబరాలు ఘనంగా నిర్వహించారు. మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌లు ముఖ్య అతిథులుగా హాజరై లబ్ధిదారులకు నమూనా చెక్కులు అందజేశారు. – శ్రీకాకుళం రూరల్/జలుమూరు



విపక్షాలన్నీ ఏకమై..

రానున్న ఎన్నికల్లో విపక్షాలన్నీ ఏకమైన సీఎం జగన్‌ను ఓడించలేవు. భవిష్యత్ తరాలకు బంగారు బాట వేసేందుకు ముఖ్యమంత్రిగా మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే గెలుస్తారు. –మంత్రి ధర్మాన ప్రసాదరావు

(సింగుపురంలో నిర్వహించిన వైఎస్సార్ చేయూత సంబరాల్లో..)



చంద్రబాబు మోసకారి

సీఎం జగన్ 99 శాతం హామీలు నెరవేర్చారు. అధికారం కోసం మాయమాటలు చెప్పేందుకు చంద్రబాబు మీ ముందుకు వస్తారు. మీరు విజ్ఞతతో తిప్పికొట్టాలి. – ధర్మాన కృష్ణదాస్, నరసన్నపేట ఎమ్మెల్యే

(చల్లవానిపేటలో నిర్వహించిన వైఎస్సార్ చేయూత సంబరాల్లో..)

క్లుప్తంగా

మహిళల హక్కుల సాధనకు పోరాటమే శరణ్యం


మాట్లాడుతున్న ఐద్వా జిల్లా నాయకురాలు సుగుణవతి

వజ్రపుకొత్తూరు రూరల్: మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల సాధనకు పోరాటమే శరణ్యమని ఐద్వా జిల్లా నాయకురాలు బి.సుగుణవతి, శ్రామిక మహిళ నాయకురాలు ఎం.మంజుల అన్నారు. శనివారం నువ్వలరేవులో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగతికి మూలమైన మహిళల పట్ల వివక్ష చూపకుండా ప్రతిఒక్కరూ గౌరవించాలన్నారు. మహిళ సాధికారత కోసం ప్రభుత్వాలు మరింత ప్రోత్సాహం అందించాలని కోరారు. పని చేస్తున్న ప్రదేశాల్లో లైంగిక వేధింపులను అడ్డుకోవాలన్నారు. కార్యక్రమంలో మహిళా సంఘ, ప్రజా సంఘ నాయకులు చామంతి, ఎస్.మోహన్‌రావు, ధనలక్ష్మి, బి.చామంతి, ఇందు, కమల, నిర్మల పాల్గొన్నారు.

'బెంతు ఒరియాలను ఎస్టీ జాబితాలో చేర్చవద్దు'


మాట్లాడుతున్న గిరిజన నాయకుడు రామారావు

పాతపట్నం: బెంతు ఒరియా, వడ్డీ కులస్తులకు ఎస్టీ ధ్రువపత్రాలు జారీ చేయవద్దని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి, రంకిణి పంచాయతీ సర్పంచ్ బి.సింహాచలం కోరారు. ఈ మేరకు బెంతు ఒరియా, వడ్డీ కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చవద్దంటూ శనివారం పాతపట్నం కోర్టు కూడలిలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి గిరిజనులు వినతిపత్రం అందజేశారు. అంతకుముందు కోర్టు కూడలి వద్ద సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో గిరిజన నాయకులు అజారి రామారావు, జి.అప్పన్న, డోలు శ్రీను, బెహర జమ్మయ్య, తవిటినాయుడు, రాంబాబు, గౌరీష్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి సంఘం ఆత్మీయ సమావేశం నేడు

గార: అంపోలు జిల్లా జైలు సమీపంలోని జిల్లా రెడ్డి సంక్షేమ సంఘానికి కేటాయించిన స్థలంలోసంఘ నూతన భవన నిర్మాణంతో పాటు ఇతర అంశాలపై చర్చించేందుకు ఆదివారం ఉదయం 10 గంటలకు ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆహ్వాన కమిటీ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి రెడ్డి ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖ వ్యాపారవేత్తలు హాజరుకానున్నారని, ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ట్రాక్టర్‌బోల్తా..ఒకరి మృతి


సంతోష్ మృతదేహం

చింతపల్లి రూరల్ (అల్లూరి సీతారామరాజు జిల్లా): ట్రాక్టర్ బ్రేకులు ఫెయిలై వంతెన కిందకు దూసుకుపోయి బోల్తా పడటంతో ఒకరు మృతి చెందగా, ఏడుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం అంతర్ల బ్రిడ్జి వద్ద శనివారం చోటు చేసుకుంది. మన్యంలో ఎన్‌హెచ్– 516 రహదారి నిర్మాణంలో భాగంగా విద్యుత్ పనులు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా విద్యుత్ స్తంభాలు, సామగ్రిని పెంటపాడు నుంచి లంబసింగికి ట్రాక్టరులో తరలిస్తున్నారు. ఈ క్రమంలో అంతర్ల బ్రిడ్జి వద్దకు రాగానే బ్రేకులు ఫెయిలై దాని కిందకి దూకుసుకుపోయి బోల్తా పడింది. దాంతో ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న ఎనిమిది మంది గాయపడ్డారు. వారిని చింతపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించగా, సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీకాకుళం జిల్లా కంచిలి మండలం సాగరవనవంగం గ్రామానికి చెందిన పట్రాసి సంతోష్ (25) మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన సాహెల్, అన్వర్‌ఖాన్, జరీఫ్‌లను మెరుగైన వైద్యం కోసం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి సిఫార్సు చేశారు. స్వల్ప గాయాలైన మిగతా నలుగురిని ఇళ్లకు పంపించేశారు.

వేసవిలో చల్లని నేస్తాలు!



ఆమదాలవలస రూరల్: ఎన్ని సంవత్సరాలైనా కొన్ని ఉత్పత్తుల క్రేజ్ ఏ మాత్రం తగ్గదు. వాటికి ఉండే అమ్మకాలు, వాటిపై ఉండే నమ్మకాలు చెక్కు చెదరక అలాగే ఉంటాయి. ఆ కోవకే చెందుతాయి పేదోడి ఫ్రిజ్‌గా పేరుగాంచిన మట్టి కుండలు. చింతాడ సంత, ఆమదాలవలస మార్కెట్ ప్రాంతంలో కుండల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. రానున్న రోజుల్లో అధిక సంఖ్యలో చలివేంద్రాలు ఏర్పాటు కానున్న నేపథ్యంలో కుండలకు గిరాకీ పెరుగుతుంది. సైజును బట్టి రూ. 50 నుంచి రూ.100 వరకు ధర పలుకుతోంది.

మేక్ ఇన్ పాలిటెక్నిక్


శిక్షణ పొందుతున్న విద్యార్థులు

- శ్రీకాకుళం పాలిటెక్నిక్ కళాశాలలో ప్రొడక్షన్ కమ్ ట్రైనింగ్ సెంటర్
- మార్కెట్ కంటే నాణ్యమైన, తక్కువ ధరకు ఫర్నిచర్ సరఫరా
- తయారీలో పట్టు సాధిస్తున్న విద్యార్థులు


కర్రను కట్ చేస్తున్న విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: జీవితంలో స్థిరపడాలంటే విద్యతో పాటు నైపుణ్యం అవసరం. కేవలం అకడమిక్ చదువుతోనే సరిపెట్టకుండా సంబంధిత కోర్సుల్లో పూర్తిస్థాయి విషయ పరిజ్ఞానం, ప్రయోగ విజ్ఞానంపై పట్టుత సాధించాలి. అలాంటప్పుడే పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోగలం. ఇదే ఆలోచనతో శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రొడక్షన్ కమ్ ట్రైనింగ్ సెంటర్ నిర్వహిస్తున్నారు. మెకానికల్ డిప్లమో విద్యార్థులకు తయారీ రంగంలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. 180 మంది విద్యార్థులకు ఉదయం క్లాస్ వర్కు, మధ్యాహ్నం వర్కు షాపుల్లో ప్రయోగాలకు ప్రాధాన్యమిస్తున్నారు.

ఆర్డర్లు సైతం స్వీకరణ..

శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల 1966లో ఏర్పాటైంది. మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో 1970 నుంచి ప్రొడక్షన్ కమ్ ట్రైనింగ్ సెంటన్‌ర్‌నిర్వహిస్తున్నారు. ఈ సెంటర్‌లో ఆర్డర్లు ఆధారంగా ఫర్నిచర్ తయారు చేస్తారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థల నుంచి ముందుగా ఆర్డర్లు స్వీకరిస్తారు. అనంతరం మెటీరియల్ టెండర్ తీసుకొని ఆర్డర్ డెలివరీ చేస్తారు. ఇప్పటికే జిల్లా కలెక్టరేట్, డ్వామా కార్యాలయంతో పాటు పలు కార్యాలయాలు, కళాశాలలకు ఆర్డర్లు అందజేశారు. నాణ్యతలో ఏ మాత్రం రాజీపడకకుండా బ్రాండెడ్ కంటే తక్కువ ధరకు బీరువాలు, కంప్యూటర్ టేబుల్స్, బెంచీలు, లైబ్రరీ, విద్యా సంస్థల రాక్‌లు, స్టూడెంట్ డెస్కులు, హాస్టల్ మంచాలు, ప్రాక్టికల్ బెంచీలు, స్టూల్స్ వంటి అనేక మెటీరియల్ సరఫరా చేస్తారు.

ఆదాయం అదుర్స్..

2022–23 ఏడాదిలో రూ. 5.89 లక్షలు ఆర్డర్లకు రూ.41 వేలు ఆదాయం వచ్చింది. 2023–24 ఏడాదికి ఇప్పటివరకు రూ. 19.65 లక్షల ఆర్డర్లకు రూ.75వేలు ఆదాయం సమకూరింది. ఈ మొత్తాన్ని కళాశాల అభివృద్ధికి ఖర్చుచేస్తారు. విద్యార్థులకు పూర్తిస్థాయిలో అన్ని రకాల ఫర్నిచర్ తయారీపై పట్టుసాధించారు. కనీసం ఏడాదికి రూ.లక్ష ఆదాయం లక్ష్యంగా ఈ కేంద్రం నిర్వహిస్తున్నారు. విద్యార్థుల్లో నైపుణ్యా కల్పన ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు.

మార్కెట్ కంటే తక్కువ ధర..



ప్రొడక్షన్ కమ్ ట్రైనింగ్ సెంటర్‌లో ఆర్డర్లపై మాత్రమే ఫర్నిచర్ తయారు చేస్తాం. నాణ్యత, పరిమాణం పక్కాగా ఉంటుంది. బయట సంస్థలతో పోల్చితే 10 శాతం వరకు ధర తగ్గుతుంది. ప్రభుత్వ సంస్థలకు మాత్రమే ఆర్డర్లపై సరఫరా చేస్తాం.

– బి.రవికుమార్, ప్రొడక్షన్ కమ్ ట్రైనింగ్ సెంటన్ ఇన్‌చార్జి, సీనియర్ లెక్చరర్

పనిపై పట్టు..



మెకానికల్ డిప్లమా మూడేళ్ల కోర్సులో భాగంగా వర్కు షాపుల్లో నిరంతరం సాధన చేస్తాం. ప్రయోగాత్మకంగా ఫర్నిచర్, బీరువాలు వంటివి తయారు చేస్తాం. ఐరన్, కలప ఫర్నిచర్‌లు తయారీ వల్ల స్కిల్స్ సాధ్యమవుతాయి. నేర్చుకున్న పని పారిశ్రామిక అవసరాలకు, వృత్తి నైపుణ్యానికి ఉపయోగపడుతుంది.

– వై.వినయ్‌కుమార్, మెకానికల్, డిప్లమా విద్యార్థి.

బృందాలుగా..



విద్యార్థులంతా బృందాలుగా విడిపోయి పనిచేస్తాం. సాధన వల్ల నాణ్యమైన ఫర్నిచర్ తయారు చేస్తాం. డిప్లమా విద్యార్థులకు అంటే స్కిల్ వర్క్, థియరీలో పూర్తి స్థాయి విషయ పరిజ్ఞానం ఉంటుంది. ప్రయోగాల వల్ల అన్ని రకాల స్కిల్స్ నేర్చుకోవచ్చు.

– సువ్వారి నాగలక్ష్మి, మెకానికల్ డిప్లమా విద్యార్థిని.

విద్యార్థుల్లో నైపుణ్యం..



పాలిటెక్నిక్ విద్యార్థులకు నైపుణ్యం కీలం. విద్యార్థుల్లో నైపుణ్యాలకు ప్రొడక్షన్ సెంటర్ దోహదపడుతుంది. ఆర్డర్ల ద్వారా ఏడాదికి కనీసం రూ. లక్ష వరకు ఆదాయం వస్తుంది. దీనిని కళాశాల ప్రగతికి ఉపయోగిస్తాం. విద్యార్థులు సైతం సబ్జెక్టులో పూర్తిస్థాయి పట్టు సాధిస్తారు.

– బి.జానకిరామ్, ప్రిన్సిపాల్, శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల

సాంకేతిక పరిజ్ఞానంతో అద్భుతాలు


పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్‌ను ప్రారంభిస్తున్న కళాశాల డైరెక్టర్ నాగేశ్వరరావు

టెక్కలి: సాంకేతిక పరిజ్ఞానంతో అద్భుతాలు సృష్టిస్తూ సమాజానికి ఉపయోగపడేలా విద్యార్థులు సరికొత్త ఆవిష్కరణలు చేయాలని టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. కళాశాలకు చెందిన ట్రిపుల్‌ఈ విద్యార్థులు రూపకల్పన చేసిన 'పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్'ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోలార్ పవర్ సాయంతో రూపకల్పన చేసిన ఈ సిస్టమ్‌తో ఒకేసారి వేలాది మందికి సమాచారాన్ని చేరవేయవచ్చునని తెలిపారు. కళాశాలలో వివిధ విభాగాల్లో ఇదే సిస్టమ్‌తో కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. భవిష్యత్‌లో బొగ్గు ఆధారిత పవర్ ఉత్పత్తి తగ్గుముఖం పడుతున్న నేపథ్యంలో ఇటువంటి ప్రత్యామ్నాయ మార్గాలతో ఎన్నో రకాల వనరులు ఆదా అవుతాయని చెప్పారు. ఈ ప్రాజెక్టు రూపకల్పనతో ఎం.హేమంత్ అనే విద్యార్థికి ఉద్యోగ అవకాశం వచ్చినట్లు తెలిపారు. ప్రాజెక్టును రూపొందించిన విద్యార్థులు పి.అవేక్, ఎండీ.అర్షద్, ఎస్.మనోజ్‌కుమార్, కె.శివరామకృష్ణ, ఎం.హేమంత్, ఎం.డీ.అనుష్, జి.వి.అనిరుద్ర, జి.శిరీషా, కె.దేవిప్రసాద్, బి.సంయుక్త, హెచ్.ఉషారాణి, కె.సంతోష్, జి.వంశీ, సీహెచ్.శిల్ప, ఎం.నరేష్‌లను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, అధ్యాపకులు జి.రామారావు, సీహెచ్.ప్రసాద్, ఎస్.సౌజన్య, డి.విజయ్‌కుమార్, డి.ఆజాద్, ట్రిపుల్‌ఈ హెచ్‌ఓడీ కె.కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఆటోకు ప్రభుత్వ కరెంట్!


వసతి గృహం వద్ద చార్జింగ్‌కు పెట్టిన ఎలక్ట్రికల్ ఆటో

టెక్కలి రూరల్: ఎలక్ట్రికల్ బైక్‌లు, ఆటోలు వంటి వాహనాలను ఎవరైనా తమ ఇళ్ల వద్ద గానీ, షోరూమ్ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక పాయింట్ వద్ద గానీ చార్జింగ్ పెట్టుకుంటారు. టెక్కలిలో మాత్రం ఓ వ్యక్తి తన ఎలక్ట్రికల్ ఆటోను ఏకంగా ప్రభుత్వ వసతి గృహంలోనే దర్జాగా చార్జింగ్ పెడుతున్నాడు. లోకల్ సర్వీసులు తిప్పుతూ చార్జింగ్ అయిపోయిన వెంటనే ప్రభుత్వ డిగ్రీ కళాశాల వెనుక భాగంలో ఉన్న సాంఘిక సంక్షేమ కళాశాల బాలుర వసతి గృహం వద్దకు వెళ్లి చార్జింగ్ పెట్టుకుంటున్నాడు. హాస్టల్ సిబ్బంది సైతం పట్టించుకోకపోవడంతో నిత్యం ఇదే తంతు కొనసాగుతోందని, అధికారులు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రెండు వాహనాలు ఢీ


క్షతగాత్రులను 108లో ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

- ఏడుగురికి గాయాలు


ఘటనా స్థలంలో వాహనాలు

రణస్థలం: మండలంలోని కొండములగాం సమీపంలో ఆటో, లగేజీ వ్యాన్ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఏడుగురు గాయపడ్డారు. జె.ఆర్.పురం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జీరుపాలెం గ్రామానికి చెందిన మత్స్యకారులు శివరాత్రి సందర్భంగా శుక్రవారం రాత్రి ఆటోలు రామతీర్థాలువెళ్లారు. తిరుగు ప్రయాణంలో శనివారం సాయంత్రం 4 గంటల సమయంలో కొండములగాం గ్రామ సమీపంలో ఎదురుగా వచ్చిన లగేజీ వ్యాన్ వీరి ఆటోను బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటోలో ఉన్న ఎం.బాబాయి, ఎ.అప్పన్న, ఎం.కొర్లమ్మ, ఎ.సత్తెమ్మ, ఎస్.అప్పన్న, పాపుడు లక్ష్మి, కాములుకు గాయాలయ్యాయి. బాధితులను 108లో లావేరు, కొండములగాం ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేశారు. తీవ్రంగా గాయపడిన వారిని శ్రీకాకుళం రిమ్స్ తరలించి చికిత్స అందిస్తున్నారు. జె.ఆర్.పురం ఎస్సై కె.గోవిందరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ తీరుపై వేతనదారుల ఆందోళన


ఉపాధి అధికారులను నిలదీస్తున్న పొల్లాడ వేతనదారులు

వజ్రపుకొత్తూరు: మండలంలోని సైనూరు ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ బి.జగదీశ్వరి దురుసు ప్రవర్తనతో అక్రమాలకు పాల్పడుతున్నారని, వెంటనే విధుల నుంచి తొలగించాలని పంచాయతీ పరిధిలోని పొల్లాడ గ్రామ వేతనదారులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఫీల్డ్ అసిస్టెంట్‌పై వచ్చిన అభియోగాలపై శనివారం సైనూరు సర్పంచ్ అట్టాడ గోవిందరావు ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. విచారణకు వచ్చిన ఇన్‌చార్జి ఏపీఓ పి.కేశవరావు, ఈసీ హరినాథ్‌లను నిలదీశారు. ఆరు రోజులు పని చేస్తే ఐదు రోజులకు మాత్రమే ఫీల్డ్ అసిస్టెంట్ వేతనం లెక్క కడుతున్నారని మండిపడ్డారు. మూడేళ్లుగా ఇదే పరిస్థితి ఉందన్నారు. గతంలోనూ విచారణ జరిగిందని, అయినా తీరు మార్చుకోవడం లేదన్నారు. తక్షణమే జగదీశ్వరిని తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై కలెక్టర్, డ్వామా పీడీలకు ఫిర్యాదు చేస్తామన్నారు.

శాంతియుత ఎన్నికలే లక్ష్యం


ఎల్.ఎన్.పేటలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, ఆర్‌పీఎఫ్ బలగాలు

ఎల్.ఎన్.పేట: శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కోరుతూ శనివారం ఎల్.ఎన్.పేట మండల కేంద్రంలో సరుబుజ్జిలి ఎస్సై బి.నిహార్ ఆధ్వర్యంలో స్థానిక పోలీసులు, ఆర్‌పీఎఫ్ బలగాలతో మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. సాధారణ ఎన్నికలు సమీపిస్తున్నందున ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా, ప్రతిఒక్కరూ నిబంధనలు పాటించాలని కోరారు. శాంతిభద్రతలకు నష్టం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మద్యం అక్రమ రవాణా, వ్యాపారం నేరమన్నారు. గ్రామాల్లో వర్గాలు, గ్రూపులు అంటూ పంతాలకు పోకుండా ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు.

పెన్షన్‌తో సామాజిక భద్రత

టెక్కలి: సామాజిక భద్రత కల్పించే పాత పెన్షన్ విధానం వివిధ రాజకీయ పార్టీల ఎన్నికల మేనిఫెస్టోల్లో ఉండేలా చూడాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శనివారం టెక్కలిలో ఉద్యోగ, ఉపాధ్యాయులతో ప్రాంతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓట్ ఫర్ ఓపీఎస్ నినాదాన్ని విస్తృతం చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు ఎల్.బాబూరావు, బి.శ్రీరామ్మూర్తి, కె.దాలయ్య, బి.శంకరరావు, పి.గణపతిరావు, టి.వైకుంఠరావు, కుమారస్వామి, వై.గణపతిరావు, టి.పాపారావు, పి.ధర్మారావు, కె.కామేశ్వరరావు, డి.పాపారావు, రజని, గాయత్రి, శారద, అనురాధ పాల్గొన్నారు.

వృద్ధురాలు అదృశ్యం


బత్తిని శేషమ్మ

కాశీబుగ్గ : పలాస మండలం మాకన్నపల్లికి చెందిన బత్తిన శేషమ్మ (75) అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు కాశీబుగ్గ పోలీసుస్టేషన్‌ను శనివారం ఆశ్రయించారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి బైకుపై వెళ్తుండగా లిఫ్ట్ అడిగి కొంతదూరం వెళ్లాక దిగిపోయిందని, మతిమరుపు ఉండటంతో ఎటు వెళ్లిందో తెలియడం లేదని కుమారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆచూకీ తెలిస్తే 6301407551, 8530097476 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

వందేభారత్ రూట్ మారింది..!


సిద్ధమైన కొత్త వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు

భువనేశ్వర్: పూరీ, విశాఖపట్నం మధ్య వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ నెల 12న వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధానమంత్రి నరేంద్రమోదీ పచ్చజెండా ఊపి 20841/20842 కొత్త వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రారంభించే అవకాశం ఉంది. రాష్ట్రంలో ఇది మూడో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలుగా నిలుస్తుంది. లోగడ ఈ రైలును భువనేశ్వర్ నుంచి విశాఖపట్నం మధ్య నడిపేందుకు ప్రతిపాదించారు. ఇప్పుడు పూరీకే పరిమితం చేశారు. శనివారం మినహా వారానికి 6 రోజులు నిత్యం ఉదయం పూరీ నుంచి బయల్దేరి మధ్యాహ్నానికి విశాఖపట్నం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో విశాఖపట్నం నుంచి మధ్యాహ్నం బయలుదేరి రాత్రికి పూరీకి రుకుంటుంది. ఖుర్దా రోడ్, బరంపురం, పలాస, శ్రీకాకుళం రోడ్, విజయనగరం స్టేషన్లలో ఆగుతుంది.

వందే భారత్ రాకపోకల వివరాలు		
20841	పూరీ–విశాఖపట్నం	
రాక	పోక	స్టేషన్
--	05.15	పూరీ
05.57	06.07	ఖుర్దారోడ్
07.40	07.42	బరంపురం
08.48	08.50	పలాస
09.33	09.35	శ్రీకాకుళం రోడ్
10.18	10.20	విజయనగరం
11.30	--	విశాఖపట్నం
20842	విశాఖపట్నం–పూరీ	
రాక	పోక	స్టేషన్
--	15.40	విశాఖపట్నం
16.30	16.32	విజయనగరం
17.28	17.30	శ్రీకాకుళం రోడ్
18.20	18.22	పలాస
19.00	19.02	బరంపురం
20.55	21.05	ఖుర్దారోడ్